

తెల్లవారుఝామున ఐదు గంటలకు కాలింగ్ బెల్ మోగింది. విసుక్కుంటూ లేచాడు వెంకట్రావు. నిద్ర మత్తుతో జోగుతూ తలుపు తీసి ఎదురుగా వున్న దూరపు బంధువు కామేశాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"అరె.. నువ్వట్రా కామాయ్... రా... రా... లోపలకురా..." అన్నాడు ఆనందంగా.

# భజన చేసే విధము తెలియండీ

ఇలపావులూరి
మురళీ మోహన రావు

లోపలకొచ్చాడు కామేశం. ''నిద్రాభంగం చేసినట్లున్నాను'' అన్నాడు.

''ఏంటో ఈ దరిద్రపు నిద్ర. ఆఫీసున్న రోజుల్లో ఎనిమిది గంటలైనా నిద్రమత్తు వదలదు. ఆదివారం మాత్రం తెల్లవారుజామునే మెలకువ వస్తుంది. సుందూ... సుందూ..' భార్యను కేకేశాడు వెంకట్రావు.

లోలోపల తిట్టుకుంటూ బెడ్రూమ్‌లోంచి బయటకొచ్చింది సుందరి.

''బాగున్నావా వదినా'' నవ్వుతూ పలకరించాడు కామేశం.

అయోమయంగా చూసింది సుందరి. గమనించాడు వెంకట్రావు. అతగాడిని గుర్తించలేదని గ్రహించాడు. అదే తన తరపు బంధువైనట్లయితే ఈపాటికి ఎగిరి గంతులేసుండేది.

''కామేశం అని... నాకు దూరబ్బంధువు. మన పెళ్ళికి కూడా వచ్చాడు...'' భార్యవంకే చూస్తూ గుర్తు చేశాడు.

గుర్తు రాలేదన్నట్లు ఎక్స్‌ప్రెషనిచ్చింది సుందరి. బంధువు ముందు తన పరువు రామార్పణమయ్యే ప్రమాదం పొడసూపగానే ఏదో మెరుపు మెరిసింది బుర్రలో.

''అవునవును. అపుడు తలవంచుకుని కూర్చున్నావు కదూ... అందుకే మర్చిపోయుంటావు. మా బాబాయి రెండో అల్లుడి తాతగారి బావమరిదికి స్వయానా మేనల్లుడు. మన పెళ్ళికి ఫుట్‌పాత్ మీద అమ్మే పదిహేను రూపాయల సింగపూర్ వాచీ ప్రెజెంట్ చేస్తే అది మర్నాడే పనిచెయ్యడం మానేస్తే మళ్ళీ దాంట్లో సెల్ వేస్తే నలభై రూపాయలవుతుందని షాపువాడు చెప్పగానే మురిక్కాలువలో పారేశాం .. గుర్తుందా?'' అన్నాడు.

కామేశం ముఖం మాడిన దిబ్బరొట్టెలా అయింది. అపుడు గుర్తొచ్చింది సుందరికి – ''ఆ... ఆ... ఆఁ... అవునవును. వచ్చింది. బాగున్నారా?'' అన్నది ముఖాన నవ్వు పులుముకుని.

ఊపిరి పీల్చుకున్నాడు కామేశం. ''ఒరేయ్ ముందు నువ్వు ముఖం కడుక్కో. కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం. నిద్రలేచిన తరువాత కాఫీ తాగకుండా ఇంతసేపుండటం నా జీవితంలో ఇదే ప్రథమం'' లేచాడు వెంకట్రావు.

ముఖాలు కడుక్కునే సరికి వేడివేడి ఫిల్టర్ కాఫీ రెండు కప్పుల్లో తెచ్చింది సుందరి. ఘుమఘుమ సువాసనలు వెదజల్లుతున్న కాఫీని చూసి పరవశించి గబగబ జుర్రేశాడు కామేశం.

''ఆ...ఇపుడు చెప్పరా. నాలుగు సంవత్సరాల తర్వాత మళ్ళీ ముఖం చూపించావు. ఏంటి విశేషం? ఏం చేస్తున్నావు? పెళ్ళెప్పుడు? సంబంధం కుదిరిందా? మాంచి పిల్ల ఉంది. చూడమంటావా?'' ప్రశ్నల వర్షం కురిపించాడు వెంకట్రావు.

''సర్లె.. తాను దూరను కంతలేదుగానీ మెడకో డోలు అన్నట్లు నాకే ఠికానా లేదు. ఇక పెళ్ళొకటా?''

''ఏంటి? నీకే ఠికానా లేదా? ఇంకా ఉద్యోగం రాలేదా?''

''సర్లె... ఆయనే ఉంటే మంగలితో పనేంటని... ఆ ఉద్యోగమే ఉంటే విశాఖ సముద్రాన్ని వదిలి కంపుగొట్టే హుసేన్ సాగర్‌కెందుకొస్తాను?''

'అరే! ముప్పై ఏళ్ళొచ్చాయి! ఇంకా ఉద్యోగం సద్యోగం లేకుండా బడుద్దాయిలా తిరుగుతున్నావా? ఎమ్మెస్సీ చదివావు గదరా?''

''సర్లె.. చదివినోడికన్నా మడేలన్న మిన్న అన్నట్లు, ఆ చదువు చదవకపోయినా హాయిగా ఏ కూలో నాలో చేసుకుంటూ ఇంత సంపాదించుకునే వాడిని. ఈ చదువుకు అటు ఉద్యోగం రాదు. ఇటు కూలీపని చెయ్యలేం. వెళ్ళిన ప్రతి ఇంటర్వ్యూలోనూ అనుభవం ఉందా అని వెధవ క్వొశ్చను. ఎవడూ ఉద్యోగం ఇవ్వకుండా అనుభవం రమ్మంటే ఎలా వస్తుంది?''

''కోడి ముందా గుడ్డుముందా అన్నట్లు ఇది కూడా ఒక సమస్యే. మరైతే ఈ రాకకు కారణం?''

''మొన్నామధ్య ఆఫీస్ అసిస్టెంట్లు కావలెను అన్న ప్రకటన చూసి ఈ ఊళ్ళో ఒక కంపెనీకి అప్లై చేశా. రేపు ఇంటర్వ్యూకు రమ్మని లెటరొచ్చింది. ఇవాళ నీకెలాగూ సెలవే కాబట్టి ఒకసారి తీరిగ్గా ఆ ఆఫీసు ఎక్కడుందో చూసి రావచ్చని వచ్చా.''

''ఈ ఊళ్ళోనా? ఏ కంపెనీరా అది?''

''ఏదో జమాజమ్ పికిల్స్ కంపెనీ అట. పచ్చళ్ళు తయారుచేసి ఫారిన్లో అమ్ముతారట. ఇక్కడెవడూ కొనడేమో?''

''వ్వాట్? జమాజమ్ పికిల్స్ కంపెనీయా... చంపావు ఫో...''

''ఎవర్ని?''

''ఇందుపల్లి కామేశ్వర వరప్రసాద సాయి మణికంఠ రాఘవేంద్రరావు అని అప్లికేషన్లో ఉంటే ఎవరో అనుకున్నా..నువ్వేనా?''

''అరె! నీకెలా తెలుసు?''

''నేను పనిచేసేది ఆ కంపెనీలోనే కదరా. ఆ కాల్‌లెటర్లు నేనే స్వయంగా టైపుచేసి పంపించా.''

''ఓహ్.. వాట్ వండర్! తంతే బూరెల బుట్టలో పడ్డట్లు.. అయితే ఈ ఉద్యోగం నాదే...''

''తొందరపడకు. చిన్న అడ్డంకి ఒకటుంది.''

''ఏంటది? కొంపదీసి దీనికీ రికమెండేషన్ కావాలా?''

''థాంక్స్ అన్నయ్యా. మాయల పకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు వాడిని పడగొట్టే ఆయువుపట్టు చెప్పావు. ఇంటి గుట్టు చెప్పి లంకకు చేటు తెచ్చిన విభీషణుడిలా బాస్ వీక్‌నెస్ చెప్పి ఉద్యోగమిప్పించావు. నువ్వు మామూలు మనిషివి కాదు. సాక్షాత్తు దేవుడివి. బంధుప్రీతి కలవాడివి. ఇతరులకు సాయం చేయడంలో నీ సాటి లేరు...''

''అవసరం లేదు. మా బాస్ మహా చండశాసన ముండావాడు. ముక్కోపి.''

''ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉందిగా.''

''యస్. అదే పాయింటు. వాడు ఎంత మంచివాడో అంత చెడ్డవాడు. ఎంత చెడ్డవాడో అంత మంచివాడు.''

''అంటే మంచివాళ్ళకు మంచివాడు. మోసగాళ్ళకు మోసగాడు.''

''అని కూడా చెప్పలేం. వాడికున్న చెడ్డ అలవాటు ఏంటంటే వాడికి పొగడ్తలు మహా ఇష్టం. ఇదొక వంక పెట్టుకుని అస్తమానం ఉబ్బేస్తుండాలి. ఏదైనా ఎదురు మాట్లాడామా – ఎంత అపకారమైనా చేస్తాడు. మా బతుకు కత్తిమీద సాములా ఉందనుకో.''

''కంగారుపడకు... పొగడటంలో నాకు భట్రాజులు కూడా సాటిరారు. పొగిడితేనే ఈ ఉద్యోగం వస్తుందనుకుంటే ఎంతకైనా తెగిస్తా. శవాన్ని కూడా భలే అందంగా ఉన్నావని పొగడగలను.''

''అలా అయితే ఈ ఉద్యోగం నీదే. వాడేం ప్రశ్న వేసినా చిన్నగా నవ్వి ఏదో ఒక పొగడ్త అందుకో. వాడు బుట్టలో పడతాడు. నువ్వు గట్టున పడతావు.''

''చూస్తుండరాదూ.. వాడిని ఎలా మునగచెట్టు ఎక్కిస్తానో!''

''ఓ విషయం.''

''ఏంటది?''

''వాడితో నాకు ఆరు సంవత్సరాల అనుభవం కాబట్టి ఈ రహస్యం నీకు చెప్పా. ఈ విషయం ఎవరికీ చెప్పకు. మనం బంధువులమన్న సంగతి అసలే తెలియనివ్వకు. అక్కడ నా దగ్గర కొత్తవాడిలా ప్రవర్తించు. వాడి వీక్‌నెస్ మిగిలిన క్యాండిడేట్స్‌కు తెలియదు కాబట్టి ఈ ఉద్యోగం నీదే. ఇంటర్వ్యూ టైంలో నేను బాస్ వెనుకే నిలుచుని సైగలు చేస్తుంటా. ఆల్ ది బెస్ట్.''

''థాంక్స్ అన్నయ్యా. మాయల పకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు వాడిని పడగొట్టే ఆయువుపట్టు చెప్పావు. ఇంటి గుట్టు చెప్పి లంకకు చేటు తెచ్చిన విభీషణుడిలా బాస్ వీక్‌నెస్ చెప్పి ఉద్యోగమిప్పించావు. నువ్వు మామూలు మనిషివి కాదు. సాక్షాత్తు దేవుడివి. బంధుప్రీతి కలవాడివి. ఇతరులకు సాయం చేయడంలో నీ సాటి లేరు...''


''అరేయ్... అరేయ్.. పొగడమన్నది నన్ను కాదురా. మా బాసును'' నవ్వాడు వెంకట్రావు.

***

ఆఫీసుకు కొంచెం దూరంగా స్కూటర్ ఆపాడు వెంకట్రావు. ''కామాయ్... ఇక్కడదిగు. నేను ఆఫీసు లోపలకు వెళ్ళిన తరువాత నువ్వు రా'' చెప్పాడు.

కామేశం దిగాడు. వెంకట్రావు వెళ్ళిపోయాడు.

ఫైలును చంకన పెట్టుకుని మెల్లగా నడుచుకుంటూ ఆఫీసులోకి ప్రవేశించాడు కామేశం. పచ్చళ్ళు తయారుచేసే ఆఫీసంటే ఏదో సాదాసీదాగా ఉంటుందనుకున్నాడు. కానీ చాలా ఆడంబరంగా ఉంది. విశాలమైన హాల్లో దాదాపు పాతిక




మంది అభ్యర్థులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అన్నీ సినిమాలకు సంబంధించినవే.

రెండు నిముషాల తరువాత రాగిరంగులో మెరిసిపోతూ లావాటి బుంగమీసాలతో, సూటు వేసుకుని హుందాగా, గంభీరంగా ఉన్న లావాటి ఒక వ్యక్తి ప్రవేశించాడు.

సూపర్నెంట్ గభాల్న లేచి "ఓహ్... గుడ్మార్నింగ్ సార్.. పద్మభూషణ్ చిరంజీవి గారేమోనను కున్నా... వెల్కమ్ టు ఆఫీస్ సార్..." అన్నాడు.

చిరునవ్వు చిందించాడు బాస్ అనబడే యం.డి. పుణ్యమూర్తి. "ఆ.. జగన్నాథం గారూ... మీరు స్టాఫ్ అడ్వాన్స్ కావాలన్నారు కదూ... ఈరోజే చెక్ తీసుకోండి." అంటూ ముందుకు కదిలాడు.

స్టెనో లేచాడు. "ఫెంటాస్టిక్ సార్. రేమాండ్స్ సూటింగ్స్ మోడల్లా ఉన్నారు. మీ కింద పనిచెయ్యడం మా అదృష్టం." అన్నాడు.

"థాంక్యూ కుమార్. నిన్న నీవు రెండు గంటలు లేట్‌గా వచ్చావు కదూ. పెర్మిషన్ కింద ట్రీట్ చేస్తాలే" అన్నాడు టై సవరించుకుంటూ.

టైపిస్ట్ కస్తూరి లేచింది. రెప్పలార్పకుండా పుణ్యమూర్తినే చూడసాగింది.

"హే..వాట్ హేపెన్డ్?" చిటికెలేశాడు పుణ్యమూర్తి.

"స్సార్... నా రెండుకళ్ళూ ఈ క్షణమే పోతే బావుణ్ణు" అన్నది.

"వ్వై?" ఆశ్చర్యంగా అన్నాడు పుణ్యమూర్తి.

"మిమ్మల్ని చూసిన ఈ కళ్ళతో ఇహ ఈ ప్రపంచాన్ని చూడలేను. మీకు ఫిఫ్టీ అంటే ఎవరూ నమ్మరు. థర్టీ అంటే నమ్మచ్చేమో?" అన్నది కస్తూరి.

పెద్దగా నవ్వాడు పుణ్యమూర్తి. "థాంక్యూ... బై ది బై... వారం రోజులు సీయల్ కావాలన్నావు కదూ నిన్న. ప్రొసీడ్..." అన్నాడు.

కస్తూరికి కొంచెం దూరంలో కూర్చున్న ఏభై అయిదేళ్ళ చీఫ్ సూపర్నెంట్ నారాయణ లేచి మామూలుగా 'నమస్కారం' అని కూర్చున్నాడు.

"సీ మిస్టర్ నారాయణ... నిన్న మీరు సబ్మిట్ చేసిన డాటా అంతా తప్పుల తడక. మీరసలు ఏమాత్రం సీరియస్‌గా వర్క్ చెయ్యడం లేదు. పైగా ఈమధ్య చాలా లేట్‌గా వస్తున్నారు. ఐ కాన్ట్ టాలరేట్ దిస్" అన్నాడు కోపంగా.

నారాయణ వణుకుతూ లేచి "సారీ సర్.. మళ్ళీ ఒకసారి వెరిఫై చేస్తాను" అన్నాడు.

ఇంతలో వెంకట్రావు పరిగెత్తుకుంటూ వచ్చాడు. పుణ్యమూర్తి ముందు శిలలా చేష్టలుడిగి నిలబడ్డాడు. నిముషం తరువాత తేరుకున్నట్లు నటించి "ఆహా... ఈ సూట్లో మిమ్మల్ని చూస్తుంటే అమెరికా ప్రెసిడెంట్‌లా వున్నారు. సూట్‌కు కొత్త అందం వచ్చింది" అన్నాడు.

"థాంక్యూ... నాకు పొగడ్తలు అస్సలు గిట్టవు వెంకట్రావ్... అవునూ... నీవు యల్టీసికి అప్లై చేశావ్ కదూ ... శాంక్షన్డ్... ఆ క్యాండిడేట్స్ లిస్ట్ తీసుకురా.. ఎవడో ఒక సన్నాసిని సెలెక్ట్ చేద్దాం" అని తన ఛేంబర్‌లోకి వెళ్ళాడు.

ఆ వైఖరి చూసి చెమటలు పట్టాయి కామేశానికి. వీరంతా బాసును రోజూ చూస్తుంటారు. ఆయన మూడ్స్, కోపతాపాలు, ఆగ్రహానుగ్రహాలు వీరికి బాగా తెలుసు. తానేమని పొగడాలో తీవ్రంగా ఆలోచించుకోసాగాడు.

లోపలికెళ్ళిన అభ్యర్థులంతా మరునిముషంలో మాడిన ముఖాలతో బయటకొస్తున్నారు. చివరగా కామేశానికి పిలుపొచ్చింది. లోపలికెళ్ళాడు. పుణ్యమూర్తి గంభీరంగా కామేశం వంక కళ్ళజోడు పైనుంచి చూస్తూ బయోడేటా చూస్తున్నాడు. వెనుకే నిలుచున్న వెంకట్రావు "పొగుడు .... పొగుడు" అన్నట్లు సైగలు చేస్తున్నాడు.

పుణ్యమూర్తి భారీ పర్సనాలిటీ, చురుకైన చూపులు కామేశంలో ఒక విధమైన టెన్షన్ కలిగించి ఆ క్షణాన ఏమని పొగడాలో అర్థం కాలేదు. వెంకట్రావు కళ్ళతోనే హెచ్చరిస్తూ తలమీద బాదుకున్నాడు. వెంటనే ఏదో ఒక ఐడియా వచ్చింది కామేశానికి.

"సార్.. చిన్న మాట..." అన్నాడు.

తల పైకెత్తి ఏంటన్నట్లు చూశాడు పుణ్యమూర్తి.

"మీ విగ్గు భలే బాగుంది సార్. విగ్గుకు వాడిన జుత్తు గొర్రె బొచ్చులా చాలా స్మూత్‌గా ఉంది" పొగిడాడు కామేశం.

గుడ్లు మిటకరించి చూశాడు పుణ్యమూర్తి. వెంకట్రావు షాకయ్యాడు. అలా మాట్లాడకూడదన్నట్లు పెదవుల మీద వేలుంచాడు. దాన్ని మరోవిధంగా అర్థం చేసుకున్న కామేశం ఉత్సాహంగా "మీ మీసాలకు వేసిన రంగు ఏ కంపెనీదో కానీ తుమ్మెదలు మీ మూతిమీద బారులు తీరినట్లుంది సార్" అన్నాడు.

పుణ్యమూర్తి ముఖం ఎర్రబడింది. వెంకట్రావు కోపంగా పళ్ళు పటపట కొరికాడు. కానీ ఆ సైగలు కామేశానికి అర్థం కాలేదు. "సార్... మీ పళ్ళు కట్టిన డాక్టరు ఎవరో కానీ దానిమ్మ గింజల్లా ఉన్నాయి సార్. నాకూ పళ్ళూడిన తరువాత ఆ డాక్టర్ చేతే కట్టించుకుంటాను" అన్నాడు ఆ ఉద్యోగం తనదే నన్న ధీమాతో.

పుణ్యమూర్తి ముఖం కమిలిపోయింది. "యూ ఇడియట్... గెట్ లాస్ట్" కప్పు ఎగిరిపోయేట్లు అరిచాడు.

★